

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాషా

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రంజిత్‌బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఓర్వకల్ పారిశ్రామిక వాడ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విమానాశ్రయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని ఆయన హామీఇచ్చారు.

రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలి

- కలెక్టరేట్ ఎదుట స్కీంవర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో చిరు ఉద్యోగులపైన స్కీమ్ వర్కర్ల పైన జరుగుతున్న రాజకీయ వేధింపులు ,తొలగింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో సోమవారం ధర్నా చేశారు. సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సిహెచ్ సాయిబాబ అధ్యక్షతన జరిగిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరు ఉద్యోగుల పైన స్కీం వర్కర్ల పైన రాజకీయ వేధింపులు , తొలగింపులు ఎక్కువయ్యాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. జిల్లాలో ఆదోని, కౌతాళం మండలాల్లో షోకాజు నోటీసులు ఇచ్చి తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ప్రభుత్వం మారినప్పుడంతా మార్చడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే కోడుమూరు, ఎమ్మిగనూరు, కల్లూరు మండలాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు పాత వారిని మార్చేసి కొత్తవారిని నియమించారన్నారు. విఒలను కూడా బలవంతంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో ఇటువంటి ప్రక్రియ మొదలైందని అన్నారు. ఆశా వర్కర్లకు రాజీనామా చేయమని బెదిరింపులు వస్తున్నాయన్నారు. నగర పరిధిలో పనిచేస్తున్న ఆర్పిలను కూడా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ రాజకీయ వేధింపులు తొలగింపుల పైన ఇప్పటికే ముఖ్యమంత్రిని సిఐటియు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు తొలగింపులు రాజకీయ వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ మెప్మాలో పనిచేస్తున్న ఆర్పిలను తొలగించాలని అనుకోవడం సరైనది కాదని, దీనికి అవసరమైతే పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం వారికి ఇవ్వవలసిన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కాల పరిమితి సర్కులర్ నురద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు, మెప్మా అర్పిల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరాజు నాయక్, విఒఎల సంఘం జిల్లా కార్యదర్శి గుంటెప్ప, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రాధాకృష్ణ, మహిమూద్,రవి, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకుడు మహమ్మద్ రఫీ, సిఐటియు న్యూ సిటీ కమిటీ నాయకులు సుధాకర్ అప్ప, యేసుచ సిఐటియు ఓల్డ్ సిటీ నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపడుతున్న నాయకులు

హంద్రీనీవా కాలువకు గండి



హంద్రీనీవా కాలువకు పడిన గండి

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండల పరిధిలోని హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం శెట్టిపల్లి (మల్లేపల్లి) పంప్ హౌస్‌కు సమీపంలో సోమవారం ఉదయం కాల్వకు గండి పడింది. దీంతో భారీగా నీరు పంట పొలాల్లోకి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్లేపల్లి, లద్దగిరి పొలిమేరలలో సుమారు 100 ఎకరాలకు పైనే పత్తి, కంది, మినుము పంటలు నీట మునిగాయి. సమాచారం అందుకున్న సాగునీటి శాఖ అధికారులు గండిని పరిశీలించారు. నీరు ఎక్కువగా వస్తుండడంతో నీరు తగ్గిన తర్వాత గండిని పూడ్చే పనిని మొదలు పెడతామని అధికారులు తెలిపారు. కాల్వలు పూర్తి చేయకుండా నీరు వదలడం వలన ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు గండ్లుపడి ఇసుక , మట్టి మేటలు పెడితే దానిని సరిచేయడానికి ఖర్చు ప్రభుత్వమే భరించాలన్నారు.

కేతవరం నుంచి గార్గేయపురం రోడ్డు వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేతవరం నుండి గార్గేయపురం వరకు వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ ఓర్వకల్లు మండల కార్యదర్శి బి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం కేతవరం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ కలెక్టర్ శివనాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. జి.రామకష్ణ మాట్లాడుతూ కేతవరం నుండి నిత్యం అనేకమంది విద్యార్థులు, గర్భిణీలు ప్రయాణికులు జిల్లా కేంద్రానికి వెళుతుంటారన్నారు. నాలుగు కిలోమీటర్ల ఉన్న రోడ్డు దాటుకుని వెళ్లాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగినా అత్యవసర చికిత్స కోసం అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే వచ్చే పరిస్థితి లేదంటే రోడ్డు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆదిమానవులు సంచరించిన ప్రదేశం కావడంతో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారన్నారు. రోడ్డు బాగా లేకపోవడం చేత సందర్శించడానికి వారు కూడా విముఖత వ్యక్తం చేస్తున్నారు. గత అనేక పోరాటాల ఫలితంగా గతంలో రోడ్డును రూ.కోటీ అరవై లక్షల వ్యయంతో వేశారని నాణ్యత లోపించడం వలన కొంతకాలానికి రోడ్డు పూర్తిగా దెబ్బతిని పోయిందన్నారు. కేతవరం నుండి గార్గేయపురం వరకు రోడ్డును నిర్మించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు. డిప్యూటీకలెక్టర్ స్పందిస్తూ జిల్లా పరిషత్ అధికారులను పిలిచి తక్షణమే రోడ్డు వివరాలను సేకరించాలని పురమాయించారు. బి.నాగన్న, సూర్యనారాయణ, రంగస్వామి, వెంకటస్వామి, గఫర్ మియా పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ శాఖలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఇ ఉమాపతికి యునైటెడ్‌ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ శాఖలో పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంగ్ ఇంజనీర్ ఎం. ఉమాపతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రతినిధి బృందం, కె.భీమేష్, పి.ప్రవీణ్ కుమార్, ఎం.జావీద్ మియా, జి.పవన్ కుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఎపిఎస్‌పిడిసిఎల్ కంపెనీ కమిటీ ఉపాధ్యక్షులు, పి. నాగరాజు తదితరులు ఎస్ఇకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల రెండు నుండి ఐదు వరకు అన్ని జిల్లాలలో సూపరింటెండెంట్ ఇంజనీర్లకు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని విన్నావిస్తామన్నారు. ఈనెల 19 న ఇపిడిసిఎల్ , ఎస్‌పిడిసిఎల్, సిపిడిసి ఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లకు సమస్యలతో కూడిన వినతి పత్రం ఇస్తామన్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరుతామన్నారు. ఇంక సమస్యలు పరిష్కారం కాకపోతే ఈనెల 28 నుండి మూడు కంపెనీలు (ఎస్పీడీసీఎల్, సిపిటిసిల్, ఈపీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం ముందు, అదేవిధంగా అన్ని జిల్లాల ఎస్ఇ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ప్రధానంగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ విద్యుత్ సంస్థల్లో రెగ్యులర్ చేయాలని,. తెలంగాణ తరహాలో డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని, స్కిల్ కార్మికులకు నెలకు రూ. 43,430 చెల్లించాలని, పది సంవత్సరాల సర్వీస్ పూర్తయిన కార్మికులందరికీ ఇన్సెంటివ్ ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు 2022 ఏప్రిల్ నుండి 2023 జులై వరకు పిఆర్‌సి ఏరియర్స్ చెల్లించాలని, పెండింగ్ పెయిడ్ హాలిడేస్ ఏరియర్స్ చెల్లించాలని, ప్రతి సబ్ స్టేషన్‌కు తక్షణమే వాచ్‌మెన్‌ను నియమించాలని, కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని , మీటర్ రీడర్లకు, ఎస్‌పిఎం కార్మికులకు జిల్లా స్టోర్ హమాలీలకు పిస్ రేటు రద్దుచేసి వారికి కనీస వేతనాలు చెల్లించాలని, నూతనంగా నియమించిన సబ్ స్టేషన్ ఆపరేటర్లకు, అదేవిధంగా వాచ్‌మెన్స్ గా పనిచేస్తూ షిఫ్ట్ ఆపరేటర్లగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుందరీకరణ అవినీతిపై విచారణ అవసరం

- పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలో సుందరీకరణ పేరుతో జరిగిన అవినీతి అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్‌కు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి ఎస్.మద్దిలేటి నగరంలో మూడు కిలోమీటర్ల మేర సుందరీకరణ పేరుతో రోడ్డు మధ్యలో డివైడర్స్ నిర్మించడం, వాటికి రంగుల మీద రంగులు వేయడం అందులో మట్టి వేస్తూ ఖరీదైన మొక్కలు నాటడం పేరుతో ఐదేళ్ల నుండి దాదాపు రూ.కోటి వరకు కుంభకోణం జరిగిందన్నారు. కొండారెడ్డి బురుజు నుండి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు, బంగారు పేట నుండి మౌర్య ఇన్ వరకు, సి క్యాంపు కూడలి నుండి నంద్యాల చెక్ పోస్ట్ వరకు రోడ్డు మధ్యలో నగరపాలక సంస్థ వారు ఆర్‌సిసి డివైడర్ నిర్మించడం దానికి ఇరువైపులా ప్లాస్టింగ్ చేయడం అది శిథిలమయ్యిందన్నారు. మళ్ళీ చేయడం వాటికి రంగులపైన రంగులు వేయడం, అందులో మట్టి వేయడం తీయడం మళ్ళీ వేయడం అందులో మొక్కలు నాటడం ఐదేళ్లుగా కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. డివైడర్ మధ్యలో నాటిన ఖరీదైన మొక్కలు 99శాతం ఎండిపోయాయన్నారు. మొత్తం నాసిరకం పనుల వల్ల రూ.కోటి వరకు కుంభకోణం జరిగిందన్నారు. ఎండిన మొక్కలు తొలగించడం, వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి సుందరీకరణ పేరుతో ప్రజాధనాన్ని వధా జరిగిందన్నారు. ఈ ప్రతినిధి బృందంలో ఎస్.రమణ గౌడ్, ఎండి.యూనస్, ఎస్ అన్వర్ బాష ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెప్మా ఆర్పీల సమస్యలపై దృష్టి పెట్టండి



గ్రీవెన్స్‌లో మెప్మాల సమస్యలను అధికారులకు వివరిస్తున్న పి.నిర్మల, ఉమాదేవి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల ,మెప్మా ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి డిమాండ్ చేశారు. ఆర్‌పిల సమస్యల పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఆర్‌పిల సంఘం నాయకురాలు రుద్రమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.నిర్మల, ఎస్ ఉమాదేవి మాట్లాడుతూ 2019 కాలపరమితి సర్కులర్ రద్దు చేయాలన్నారు. హెచ్.ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. గ్రేడింగ్ విధానం రద్దు చేసి నెలకు రూ.పదివేల వేతనం ఇవ్వాలని కోరారు. ఆధార్ సీడ్ లాగిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్పీలకే లాగిన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశివ లీలను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అంతకు ముందు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులను కలిసిసమస్యలను వివరించారు.

కర్నూలు డిఎస్‌పిగా జె. బాబు ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు డిఎస్‌పిగా జె. బాబు ప్రసాద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.కర్నూలు డిఎస్‌పిగా ఇదివరకు పని చేస్తున్న డిఎస్‌పి కె. విజయశేఖర్ ఎపి హెడ్ క్వార్టర్ కు బదిలీ అయ్యారు.

డిఎస్‌పి గురించి: సిఐగా కర్నూలు టు టౌన్ పోలీసు స్టేషన్, ఆత్మకూరు పోలీసుస్టేషన్, కర్నూలు స్పెషల్ బ్రాంచ్ , కర్నూలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ లలో పని చేశారు. కర్నూలు స్పెషల్ బ్రాంచ్, నెల్లూరు జిల్లా గుడూరు పోలీసుస్టేషన్ , చిత్తూరు దిశ పోలీసు స్టేషన్ , 2024 ఫిబ్రవరి నుండి కర్నూలు మహిళా పోలీసుస్టేషన్‌లలో పని చేశారు. కర్నూలు మహిళా పోలీసు స్టేషన్ డిఎస్‌పిగా పని చేస్తూ ఇటీవల జరిగిన సాధారణ డిఎస్‌పిల బదిలలో కర్నూలు డిఎస్‌పిగా వచ్చారు.కర్నూలు సబ్ డివిజన్ లో నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా కర్నూలు జె.బాబు ప్రసాద్ తెలిపారు.

వెల్దుర్తి సిఐగా మధుసూదన్ రావు



ప్రజాశక్తి-వెల్దుర్తి : వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలం నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి. మధుసూదన్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు విఆర్ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీపై వెల్దుర్తికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్నటువంటి మధుసూదన్ రావు కర్నూలు విఆర్‌కు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. శాంతి భద్రతలకు విగాథం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఎస్ఐ సునీల్ కుమార్ పోలీస్ సిబ్బంది సిఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 89 ఫిర్యాదులు

కర్నూలు క్రైమ్: కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు సిఐలు అబ్దుల్ గౌస్ , శివ శంకర్ లు కర్నూలు కొత్తపేటలోని జిల్లా ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 89 ఫిర్యాదులు వచ్చాయి.

ఘనంగా మంత్రి టిజి భరత్ బర్త్ డే వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గోమాతకు సేవ చేస్తే అంతా మంచి జరుగుతుందని రాష్ట్రపరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ చెప్పారు. కర్నూలు నగర శివారులోని గాయత్రీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాయత్రి గోశాలలో మంత్రి టిజి భరత్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. తన తండ్రి, రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్‌తో పాటు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత చండీ హోమం, ఆయుష్ హోమం నిర్వహించారు. అనంతరం గోవులకు గ్రాసం పెట్టారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యాల సమయంలో గోసేవ చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. గోవుకు ప్రదక్షిణం చేస్తే సాక్షాత్తు 33 కోట్ల దేవతలకు ప్రదక్షిణం చేసినట్లేనని పురాణాలు చెబుతున్నాయన్నారు. అంతకుముందు మంత్రి నివాసంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి నవీన్, తదితరులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి టిజి.భరత్

పలుచోట్ల సేవా కార్యక్రమాలు: రాష్ట్ర మంత్రి టి.జి భరత్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు, పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ మేరకు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన వారు గోవులకు గ్రాసం, పండ్లు తీసుకొచ్చారు. గాయత్రీ గోశాలలో లక్కీ 2 యూత్ గోపీనాథ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారందరిని మంత్రి టిజి భరత్ అభినందించి పండ్లు అందజేశారు. అనంతరం ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. టిజి భరత్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన గోశాలకు విరాళాలు అందజేశారు. గోవులకు గ్రాసం, ధాన్యం, కూరగాయలు అందించారు. అనంతరం కర్నూలు నగరంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా ప్రాంగణంలో టిడిపి వీరశైవ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివరాజు ఆధ్వర్యంలో నాయకులు మొక్కలు నాటారు. నగరంలోని ధర్మపేట, అరుంధతి నగర్‌లోని వెయ్యి మందికి టిడిపి నేతలు లంచ్ బాక్సులు పంపిణీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో టిజి భరత్ అభిమానులు, టిడిపి నేతలు మొక్కలు నాటారు.



టిజి.భరత్ కుటుంబసభ్యులను ఆశీర్వదిస్తున్న పండితులు



అన్నదాన కార్యక్రమంలో షడ్రక్ సతీమణి అన్నపూర్ణ, కుమారుడు డాక్టర్ వినోత్

షడ్రక్ వర్ధంతి సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని భావించి కార్మిక నేత టి.షడ్రక్ 4వ వర్ధంతి సందర్భంగా రోడ్ సైడ్ చిన్న వ్యాపారుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు నగరంలో ఉన్న ఇందిరాగాంధీ నగర్ సుందరయ్య భవన్‌లో కార్మిక నేత సిపిఎం నేత కీర్తిశేషులు టి షడ్రక్ 4వ వర్ధంతి సందర్భంగా ఆర్‌టిసి బస్టాండ్ ఏరియాలో ఉన్న రోడ్ సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో అన్నదాన చేశారు. టి.షడ్రక్ సతీమణి టి.అన్నపూర్ణమ్మ. వారి అబ్బాయి డాక్టర్ టి.వినోద్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు, చిన్న వ్యాపారుల సంఘం న్యూ సిటీ కార్యదర్శి ఎస్.మొహమ్మద్ రఫీ, అధ్యక్షులు బి.గోపాల్ హాజరై అన్నదానం చేశారు. రోడ్ సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం సిఐటియు కార్యకర్తలు ఎస్.గౌస్, టి.శ్రీనివాసులు, గోపాల్ , హుస్సేన్, మళ్లీ, అశోక్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు, కె.ప్రభాకర్, నగర కమిటీ సభ్యులు సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సి బెళగల్

సి బెళగల్ తహసీల్దార్‌గా విజయశ్రీ సోమవారం రెవిన్యూ సిబ్బంది సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. రైతులకు, ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉండి తగు సేవలు అందిస్తామన్నారు. మండలంలో రెవిన్యూ సేవలను పటిష్టం చేసేందుకు సిబ్బంది పని తీరులో మెలకువలు పాటించాలని కోరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయశ్రీ

మంత్రి భరత్‌కు ఎమ్మెల్యే దస్తగిరి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్‌కు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం టిజి.భరత్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



క్రిష్ణగిరి తహశీల్దారుగా డి చంద్రశేఖర్

ప్రజాశక్తి-క్రిష్ణగిరి : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని క్రిష్ణగిరి మండల తాసిల్దార్ డి.చంద్రశేఖర్ అన్నారు. క్రిష్ణగిరి తహశీల్దార్ గా డి.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగియడంతో మండలాలకు ప్రభుత్వ బదిలీ చేయడంతో క్రిష్ణగిరి మండలానికి బదిలీపై వచ్చినట్టు తెలిపారు. ఆయనకు విఆర్ఒలు పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బసలదొడ్డి ఎత్తిపోతల
పంపుహౌస్ సామాగ్రి ధ్వంసం
- దాదాపు రూ.12 లక్షల విలువ చేసే స్టార్టర్, డీపర్ ధ్వంసం
- డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామ శివారులో ఉన్న బసలదొడ్డి ఎత్తిపోతల పంపు హౌస్‌లో ఉన్న సామాగ్రిని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఇరిగేషన్ అధికారులు, మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి సోమవారం సంఘటన స్థలానికి చేరుకుని ధ్వంసమైన పరికరాలను, బసలదొడ్డి ఎత్తిపోతల పంపు హౌస్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులు ఆదేశాలతో డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేపట్టారు. పంపుహౌస్‌లోని ముందు భాగంలో ఉన్న షెట్టర్‌ను పగులకొట్టి అందులో ఉన్న సుమారు రూ.12 లక్షల విలువ చేసే స్టార్టర్లు, డీపర్‌ను ధ్వంసం చేశారని ఇరిగేషన్ ఎఇ హరిప్రసాద్ తెలిపారు. 6,450 ఎకరాలకు సాగునీరు అందించే ఈ పంపుహౌస్‌కు ఉన్న షెట్టర్‌ను ఇనుప రాడ్ల సహాయంతో వంచి లోపలికి ప్రవేశించిన దుండగులు అక్కడ ఉన్న పరికరాలను పగులగొట్టారు. వారం రోజుల క్రితం మాధవరం గ్రామ సమీపంలో ఉన్న గురురాఘవేంద్ర ప్రాజెక్టు స్టేజ్-1లో కూడా గుర్తు తెలియని దుండగులు పంపు హౌస్‌లో స్టార్టర్లు, మోటార్లను ధ్వంసం చేశారు. వారంలో రెండు పంపు హౌస్‌లను ధ్వంసం చేయడం వెనుక ఉన్న కారణాలను పోలీసులు వెలికి తీయాల్సి ఉంది. రాజకీయ కుట్రనా లేక నియోజకవర్గంలో రాజకీయ పార్టీల మధ్య చిచ్చు పెట్టేందుకు వేసిన పన్నాగమా అని తేల్చాల్సి ఉంది. దుండగులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ధ్వంసమైన సామాగ్రి

మోడల్ స్కూల్, బాలుర బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో ఎపి మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలుల బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంతమైన చిప్పగిరి మండలం చాలా వెనుకబడిన ప్రాంతమని తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇక్కడి విద్యార్థులు ఎపి మోడల్ స్కూల్ లేక నష్టపోతున్నారని తెలిపారు. మోడల్ స్కూల్ ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి హాస్టల్‌లో 100 మంది బాలికలు చదువుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. చిప్పగిరిలో ప్రభుత్వ బాలుల బీసీ హాస్టల్ లేకపోవడంతో దూర ప్రాంతాల విద్యార్థులకు చదువుకోడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే విరుపాక్షి స్పందించి... సమస్యను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఎస్ఎఫ్ఐ నాయకులు హరి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే విరుపాక్షికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విఆర్ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి
- సిఐటియు నాయకులు నారాయణస్వామి

ప్రజాశక్తి - చిప్పగిరి

అర్హత ఉన్న గ్రామ సేవకులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని సిఐటియు డివిజన్ నాయకులు కెపి.నారాయణస్వామి, విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు చంద్రయ్య, ఉపాధ్యక్షులు భీమన్న డిమాండ్ చేశారు. సోమవారం నారాయణస్వామి ఆధ్వర్యంలో గ్రామ సేవకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడారు. విఆర్ఎలకు వాచ్‌మేన్ విధులు అప్పజెప్పకూడదని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో వాచ్‌మేన్, అటెండర్, రికార్డు అసిస్టెంట్లు పోస్టులకు అర్హత ఉన్న గ్రామ సేవకులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమంతు, పులికొండ, ప్రమీలమ్మ, హుసేని పాల్గొన్నారు. **మంత్రాలయం** పెద్దకడబూరులో డిప్యూటీ తహశీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు తిక్కన్న, విఆర్ఎలు భీమన్న, బజారప్ప, నాగరాజు, రమేష్, ఉసేని పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఎలు

ఎపి మోడల్ స్కూల్‌లో
విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామ సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థిని పార్వతి (16) ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం ఉదయం గది తలుపులు తెరిచి చూడగా హాస్టల్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నారు. మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన కురువ గుండమ్మ, గుండప్ప కుమార్తె పార్వతి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణమూర్తి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఎస్పీ శివ నారాయణ స్వామి, డిఇఒ శ్యాముల్, తహశీల్దార్ ఎస్.రవి, ఎంపిడిఒ మునెప్ప ఘటనపై పాఠశాల ప్రిన్సిపల్ కె.ప్రసాద్, వార్డెన్ కె.సుజాతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్వతి మృతికి గల కారణాలు తెలపాలని తల్లిదండ్రులతో పాటు ఎఐఎస్ఎఫ్, రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాత్రి వరకు పనిచేసిన సిసి కెమెరాలు ఉదయం మాత్రం ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థిని ఆత్మహత్యపై తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘటన స్థలాన్ని టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రామకృష్ణారెడ్డి పరిశీలించి, ఆరా తీశారు. పార్వతి ఆత్మహత్య అనుమానాలకు తావిస్తోందని తల్లిదండ్రులు మాధవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.


సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బాధితులకు ఆర్థిక సాయం

విద్యార్థిని పార్వతి ఆత్మహత్య విషయం తెలుసుకున్న వైసిపి యువ నేత వై.ప్రదీప్ రెడ్డి మృతురాలి బంధువుకు తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు. పార్వతి ఆత్మహత్య విషయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు వై.ప్రదీప్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి హాస్టల్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను పూర్తిస్థాయిలో విచారించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మను కోరారు. ఆత్మహత్య వెనుక ఎంతటి వారున్నా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఆదోని



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని వన్‌టౌన్ సిఐ శ్రీరామ్ హెచ్చరించారు. సోమ వారం ఆయన పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో మట్కా, పేకాట నిర్వహించినా, సారా, కర్ణాటక మద్యం విక్రయాలు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు తమకు సమాచారం ఉందని, అలాంటి వారిపై నిఘా ఉంచి కట్టడి చేస్తామని తెలిపారు. ఆధారాలతో అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలకాలని, లేకపోతే పోలీసు దెబ్బ రుచి చూపిస్తామని హెచ్చరించారు. అంతకుముందు ఆయనకు పోలీసులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో
అలసత్వం వహిస్తే చర్యలు
- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ హెచ్చరించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో డివిజన్‌లోని ఆయా ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయపు పరిపాలన అధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యావతి, ఆర్‌టిఒ నాగేంద్ర, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవి కుమార్, తహశీల్దార్లు కుమారస్వామి, శ్రీనాథ్, డిప్యూటీ తహశీల్దార్లు దీపా, పెద్దయ్య, వలీ బాష పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

వైసిపి నాయకులు వెంకటేష్‌కు బుట్టా పరామర్శ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో టిడిపి నాయకుల దాడిలో గాయపడిన వైసిపి నాయకులు గొల్ల వెంకటేష్‌ను వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక పరామర్శించారు. సోమవారం గొల్ల వెంకటేష్ నివాసానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వెంకటేష్‌కు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, బనవాసి నల్లారెడ్డి, పరమాన్ దొడ్డి నాయకులు గొల్ల లక్ష్మీనారాయణ, జి.రంగన్న, జి.నర్సప్ప, బోయ హనుమన్న, చాకలి గోవిందు, గొల్ల నాగప్ప, గొల్ల సిరంజి పాల్గొన్నారు.


వెంకటేష్‌ను పరామర్శిస్తున్న బుట్టా రేణుక

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం : ఐటిడిపి

ప్రజాశక్తి - నందవరం

గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఒక మొక్క, ప్రతి వీధిలో మొక్కలు నాటి పర్యావరణ రక్షించుకుందామని ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు కురువ వీరేష్ తెలిపారు. సోమవారం మండలంలోని నదికైరవాడి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాలంలో చెట్లు లేకపోవడంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ అందడం లేదని తెలిపారు. సరైన సమయంలో వర్షాలు కురవక పంటలు సరిగా పడడం లేదన్నారు. రైతులు పొలం గట్లపై మొక్కలు నాటడంతో పర్యావరణం ఎంతో ఆహ్లాదంగా మారుతుందని, మంచి వర్షాలు కురవడంతో పాటు ఆక్సిజన్ కూడా అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. టిడిపి నాయకులు అమానుల్లా, తాయన్న, వీరాంజనేయులు, నరసన్న, ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న నాయకులు

ఈరన్న స్వామి భక్తుల నిలువు దోపిడీ
- గుండుకు రూ.100 వసూలు
- పరిసరాల అపరిశుభ్రతపై భక్తులు మండిపాటు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల్లో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కల్యాణ కట్టలో భక్తులకు గుండు చేసేందుకు రూ.100 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఆదివారం అమావాస్య, సోమవారం శ్రావణ మాసపు మొదటి వారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రెండురోజుల్లో సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనంతో పాటు మొక్కుబడి కింద తలనీలాలు సమర్పించుకున్నారు. తలనీలాలు సమర్పించే భక్తులు దేవాలయం టికెట్ కౌంటర్‌లో రూ.40 చెల్లించి టికెట్ తీసుకొని తలనీలాలు ఇవ్వడానికి కల్యాణకట్టకు వస్తారు. ఇదే అదునుగా భావించి కల్యాణ కట్టలో అనధికారకంగా రూ.100 భక్తుల నుంచి వసూలు చేస్తున్నారు. అధిక ధరలతో భక్తుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఈ నిలువు దోపిడీని దేవాలయ అధికారులు అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

దోపిడీని అరికట్టాలి : తిరు మల్లేష్, భక్తుడు

కర్ణాటకలోని రాయచూర్ పట్టణానికి చెందిన తిరుమలేష్ అనే తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయన మాట్లాడుతూ... చిన్న పాపకు నాలుగు వెంట్రుకలు తీయడానికి రూ.50 తీసుకున్నారని, తనకు గుండు కొట్టడానికి రూ.100 తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుణ్యక్షేత్రంలో మురుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. పరిసరాల్లోనే భక్తులు బహిర్భూమికి వెళ్తున్నారని, దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. దీనివలన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు నిలువు దోపిడీని అరికట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఉరుకుందలో ఘనంగా ధ్వజారోహణ

శ్రీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో శ్రావణమాసం ధ్వజారోహణ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, పండితులతో డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి, శ్రావణమాస ఉత్సవాలను ప్రారంభించారు.

సౌకర్యాల కల్పన చర్యలు : డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్

భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ తెలిపారు. వివిధ శాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీరు, మురుగుదొడ్లు, వసతి గృహాలు, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి సమీక్షించినట్లు తెలిపారు. మూడు రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కల్యాణ కట్టలో గుండుకు రూ.100 తీసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారిని పిలిపించి హెచ్చరించామని చెప్పారు. భక్తులకు ఉచిత దర్శనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకాధికారి పాండురంగ రావు, సూపరింటెండెంట్లు మల్లికార్జున, వెంకటేష్, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, రెవెన్యూ స్పెషల్ ఆఫీసర్ రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తుడు


పూజలు నిర్వహిస్తున్న సిబ్బంది


అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్

నేడు ఆశాలతో సమావేశం
- వైద్యాధికారులు విజయ్ భాస్కర్, కల్యాణ్ కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ



మండలంలోని ఆశాలతో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు విజయ భాస్కర్, కల్యాణ్ కుమార్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఆశా వర్కర్ల విధులు, బాధ్యతల గురించి తెలియజేసి, గర్భిణులు, బాలింతల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల ఆశా వర్కర్లు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

అందుబాటులో ఉండి సేవలందిస్తా
- తహశీల్దార్ కుమారస్వామి

ప్రజాశక్తి - గోనెగండ్ల



ప్రజలకు అందుబాటులో ఉండి సేవలంది స్తానని తహశీల్దార్ కె.కుమార స్వామి తెలిపారు. సోమవారం ఆయన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను గతంలో ఆస్పరి, పెద్దకడబూరు, పత్తికొండ మండలాల్లో పనిచేసినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలో ఎన్నికల విధులు నిర్వహించి ప్రభుత్వ బదిలీల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ వద్ద రిపోర్టు చేసుకొని గోనెగండ్ల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పని చేసి భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలు, విఆర్ఎలు పూలమాలలు, శాలువాలతో ఆయన స్వాగతం పలికారు.

ఐసిడిఎస్ అధికారుల విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని రాఘవేంద్ర నగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రం-4లో అంగన్వాడీ టీచర్ బి.శ్వేత మనీషా అనే చిన్నారిని బెత్తంతో వాతలు పడేటట్టు కొట్టారని మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, భాగ్యలక్ష్మిలు విచారణ చేపట్టారు. సోమవారం అంగన్వాడీ కేంద్రానికి చేరుకున్న వారు చిన్నారి మనీషా తల్లి శారమ్మను, తాత తిమ్మప్పను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాప ఒక్కోసారి ఒక్కో సమాధానం చెబుతుందని వారు తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ఏ విద్యార్థినీ కొట్టలేదని, గిట్టని వారు పుకార్లు పుట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అంగన్వాడీ టీచర్ శ్వేత ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి మనీషా వీపుపై వాతలు పడేటట్లు కొట్టారని వచ్చిన వార్తలపై వివరణ ఇవ్వాలని కోరారు. ఎలాంటి సంఘటనా జరగలేదని రాతపూర్వకంగా ఇచ్చిన ఆమెను పిల్లల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి తప్పుగా భావించి మెమో జారీ చేశారు.

డబ్బుకు ఆశపడి వ్యక్తి హత్య
- నిందితుల అరెస్టు
- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ఆస్పరి

డబ్బుకు ఆశపడి వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నహోతూరు గ్రామ సమీపంలో బాగ్గప్ప బావి దగ్గర గతనెల 28న వ్యక్తిని హత్య చేసి ముళ్లపొదల్లో డ్రమ్ములో కుక్కిన కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన కురువ పేటయ్య అప్పులు ఎక్కువగా ఉండడంతో తనకున్న 60 సెంట్ల పొలాన్ని తమ్ముడు కురువ నల్లన్నకు అమ్ముకున్నారని తెలిపారు. పొలం అమ్మగా వచ్చిన రూ.7.50 లక్షలను కాజేయాలని హులేబీడు గ్రామ సమీపంలో ఉన్న పంపన్న ఆచారి పొలంలో మసీదుపురానికి చెందిన బోడబండ నరసింహులు, పెద్దహోతూరు గ్రామానికి చెందిన హనుమంతు పేటయ్యకు మద్యంలోకి సైనేడ్ మందు కలిపి తాగించారని చెప్పారు. మద్యం సేవించిన పేటయ్య స్పృహ తప్పగా హత్య చేసినట్లు తెలిపారు. పేటయ్య మృతదేహాన్ని ఆచారి పొలంలోనే జులై 25న పెండ దిబ్బలో పూడ్చిపెట్టారని చెప్పారు. రెండు రోజుల తర్వాత దుర్వాసన రావడంతో నిందితులు మృతదేహాన్ని పంపన్న ఆచారి సహకారంతో డ్రమ్ములోకి కుక్కి సీల్ వేసి ఆటోలో ఆస్పరి రోడ్డుకు తరలించి చిన్నహోతూరు గ్రామ సమీపంలో డ్రమ్మును పారేసి వెళ్లిపోయారని తెలిపారు. మిస్టరీ హత్యగా మారిన ఈ కేసును డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఛేదించారు. ఈ కేసులో బోడిబండ నరసింహులు, కురువ హనుమంతు, పంపన్న ఆచారిని హులేబీడు వద్ద అరెస్టు చేసి రూ.7.50 లక్షల నగదును, ఒక మోటార్ బైక్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. సిఐలు హనుమంతప్ప, మురళీమోహన్, ఎస్ఐలు ఓబులేసు, నరేంద్ర పాల్గొన్నారు.


నిందితులను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి


పేటయ్య (ఫైల్)

మైనార్టీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి
- కమిషనర్‌కు ఆవాజ్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారులోని మైనార్టీ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆవాజ్ కార్యదర్శి ఇక్బాల్ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం'లో కమిషనర్ రామచంద్రరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీ ఏర్పడి 20 ఏళ్లయిందని, ఇప్పటికీ రాకపోకలకు మెయిన్ రోడ్డు లేదని తెలిపారు. మట్టి రోడ్లు ఉన్నాయని, వర్షం వస్తే బురదమయం అవుతున్నాయని చెప్పారు. లింకు రోడ్లు, మురుగు కాలువలు, కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని కోరారు. కాలనీలో ముళ్ల కంపలు పెరిగిపోయాయని, పాములు సంచరిస్తున్నాయని తెలిపారు. పరిసరాలను శుభ్రం చేసి వాటర్ ట్యాంకును శుభ్రం చేయాలని కోరారు. ఆవాజ్ నాయకులు హుస్సేన్, సహాయ కారదర్శి అజీమ్ ఖాన్ పాల్గొన్నారు.

'పిజిఆర్ఎస్'ను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్

ప్రజలు సమస్యల సత్వర పరిష్కారానికి 'పిజిఆర్ఎస్ మీ కోసం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన 'పిజిఆర్ఎస్ మీకోసం'లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ... ప్రజలు సమర్పించిన అర్జీల్లో ఆధార్ కార్డు నెంబర్ తప్పనిసరిగా పొందపరచాలని తెలిపారు. ఆర్థిక పరమైన ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తాగు నీరు, కాలువ నిర్మాణంపై 2 అర్జీలు, ఇంటి పన్ను తగ్గించాలని 1, పారిశుధ్యంపై 2 అర్జీలు వచ్చాయని తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'తల్లిపాలు బిడ్డకు అమృతం'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివని అంగన్వాడీ టీచర్లు ఎం.రమాదేవి, కె.మల్లేశ్వరి, ఆశావర్కర్ బి.శివలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని ఎర్రకోట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లిపాలలో బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, పిండి పదార్థాలు లభిస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ టీచర్లు యు.సుశీల, వెల్‌నెస్ సెంటర్ సిహెచ్ఒ నారాయణమ్మ, ఆశాలు ఎం.అన్వేషరి, కె.విశాలాక్షి పాల్గొన్నారు. **చిప్పగిరి** మండల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన ఆదేశాల మేరకు నేమకల్లు గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో టీచర్ బాల రంగమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించా రు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో అందించే ఫోర్టీ ఫైడ్ రైస్, కంది పప్పు, నూనె, పాలు, గుడ్లు బాలామృతంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్లు వన్నూరమ్మ, పార్వతమ్మ, వైద్యాధికారి సువర్ణమ్మ, మహిళా పోలీసు పావని, వైద్య సిబ్బంది రెడ్డి శేఖర్, ఆశా కార్యకర్త రాధమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్ఎల్‌సి నుంచి ఆయకట్టుకు
నీటిని విడుదల చేయాలి
- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

పెద్దకడబూరు మండలంలోని అన్ని గ్రామాల ఆయకట్టుకు ఎల్ఎల్‌సి నుంచి నీటిని విడుదల చేయాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్ మాట్లాడారు. మండలంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయకట్టుకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. 2022-23 వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.10 వేలు రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలని, సబ్సిడీ కింద వ్యవసాయ పనిముట్లు అందజేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు బాబు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన సిపిఎం నాయకులు

పెద్దకడబూరు తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనాథ్‌ను సిపిఎం నాయకులు తిక్కన్న, పరమేష్, ఈరన్న, బాబు కలిశారు. పార్టీలకతీతంగా ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.


మాట్లాడుతున్న శ్రీమఠం అధికారులు

ఆరాధనోత్సవాలకు సహకరించండి
- శ్రీమఠం అధికారులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల విజయవంతానికి సహకరించాలని వివిధ శాఖల అధికారులను శ్రీమఠం అధికారులు కోరారు. సోమవారం స్థానిక టిటిడి కల్యాణ మండపంలో రెవెన్యూ, గ్రామ పంచాయతీ, పోలీసు, రోడ్లు, భవనాలు, విద్యుత్, వైద్య, ఆరోగ్య, ఆర్‌టిసి, కర్ణాటక ఆర్‌టిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శాఖలకు సంబంధించిన వారు అందుబాటులో ఉండాలని, ఆరాధన మహోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా శ్రీమఠం యాజమాన్యం తగిన చర్యలు చేపట్టిందని తెలిపారు. శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, పిఆర్ఒ ఐపి.నరసింహ మూర్తి, ఇఇ సురేష్ కోనాపూర్, డాక్టర్ సుధీంద్ర రావు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు, విద్యుత్ ఎఇ గోవిందు, ఆర్అండ్‌బి ఎఇ సాయి సురేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర

ప్రజాశక్తి - మంత్రాలయం

వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు తెలిపారు. సోమవారం పెద్దకడబూరు ఎఒ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాఘవేంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త వై.మౌనిక, విస్తరణ శాస్త్రవేత్త చందన, వ్యవసాయ సహాయకులు ఎం.శ్వేత, సి.ఇందు పెద్దకడబూరులోని పత్తి, మిరప, వరి పొలాలపై క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లోటు వర్షపాతం కారణంగా పంటలు వడలిపోయాయని, బెట్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. లీటరు నీటికి 10 గ్రాముల 19:19:19 లేదా 20 గ్రాముల యూరియా లేదా 10 గ్రాముల 13:0.45 కలిపిన ద్రావణాన్ని పిచికారి చేస్తే వారం నుంచి పది రోజుల వరకు పంటలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. వరి నారుమళ్లలో సోడియం లవణాలు ఎక్కువగా ఉన్న నీటిని వినియోగించడం వల్ల నారు ఎదగకుండా వాడుపట్టిందని, అలాంటి నారుమళ్లలో 2 కిలోల కాల్షియం సల్ఫేట్, 5 కిలోల ఇసుక కలిపి చల్లుకోవడం, నీటిని బయటకు పంపడం, 10 గ్రాముల 19:19:19 వంటివి పిచికారి చేయడం వల్ల కొంతవరకు కాపాడుకోవచ్చని తెలిపారు.


రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు